క్లుప్తంగా

సర్వేను సకాలంలో పూర్తి చేయండి



గడివేములలో కులగణన సర్వేను నిర్వహిస్తున్న వలంటీర్లు, సచివాలయ సిబ్బంది

గడివేముల: మండలంలోని గ్రామాల్లో కులగణన సర్వేను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప అన్నారు. బుధవారం మండలంలో జరుగుతున్న కులగణన సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు సేకరించిన వివరాలపై ఆరాతీశారు. ప్రతి వలంటీరు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటి వద్దకు వెళ్లి పకడ్బందీగా వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

బాలికల సాధికారతతో శక్తివంతమైన సమాజం



మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

కోడుమూరు: బాలికల సాధికారతతోనే శక్తివంతమైన సమాజం నిర్మింపబడుతుందని కోడుమూరు ఎస్‌ఐ శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక కేవీఆర్ జూనియర్ కళాశాలలో కోడుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్‌ఐ శ్రీనివాసులు బాలికలనుద్దేశించి మాట్లాడుతూ బాలికలంతా చక్కగా చదువుకుని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ వసంతలక్ష్మి, ప్రిన్సిపాల్ శేఖర్, ఆరోగ్య విస్తరణాధికారి నరసప్ప, సూపర్‌వైజర్‌లు రాధ, కమాల్ సాహెబ్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించండి



సి.బెళగల్లో ఉపాధిహామి సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న డ్వామా ఏపీడీ అల్లిపీర


సి.బెళగల్: గ్రామాలలో పనులను అడిగిన కూలీలందరికీ ఉపాధి పనులను కల్పించాలని డ్వామా ఏపీడీ అల్లిపీర తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఏపీడీ మాట్లాడారు. వ్యవసాయ పనులు లేని ప్రాంతాలలో కూలీలకు వంద శాతం పనులు కల్పించాలన్నారు. పండ్లు, పూల తోటల పెంపకాలకు ముందుకు వచ్చే రైతులను గుర్తించాలని, ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాకాలను రైతులకు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో ఏపీఓ లక్ష్మన్న, ఈసీ పృధ్వీరాజు,టీఏలు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సహాయ ఎన్నికల అధికారిగా తహసీల్దార్ జయన్న



కోడుమూరు రూరల్ : ఉత్తమ సహాయ ఎన్నికల నమోదు అధికారిగా కోడుమూరు తహసీల్దార్ జయన్న ఎంపికయ్యారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలను మండలంలో చురుకుగా నిర్వహించడంతో పాటు, ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు, ఓటరు జాబితా తనిఖీ నిర్వహించి జాబితాను పకడ్బందీగా రూపొందించినందుకు తహసీల్దార్‌ను ఉత్తమ అవార్డుకు ఉన్నతాధికారులు ఎంపిక చేశారు. ఈ అవార్డును జాతీయ ఓటరు నమోదు దినోత్సవంలో భాగంగా గురువారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఉన్నతాధికారుల చేతులమీదుగా జయన్న అవార్డు అందుకోనున్నారు.

ఓటరు దినోత్సవాన్ని విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శేషఫణి

సి.బెళగల్: మండలంలో గురువారం నిర్వహించనున్న 15 జాతీయ ఓటరు దినోత్సవాన్ని అధికారులు విజయవంతం చేయాలని తహసీల్దార్ శేషఫణి అన్నారు. బుధవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, బీఎల్వోలతో సమావేశం ఏర్పాటు చేసి జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు, పౌరహక్కులు, బీఎల్వోల విధులు తదితర అంశాలపై తహసీల్దార్ మాట్లాడారు. గ్రామాలలో చేపట్టాల్సిన వివిధ కార్యక్రమాలపై ఆయన సూచనలు చేశారు.

క్రీడలతో మానసిక ఆనందం

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- ఓర్వకల్లులో అట్టహాసంగా నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు : క్రీడలతో మానసిక ఆనందం కలుగుతుందని స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన ఓర్వకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నియోజకవర్గ కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం.. ఆంధ్ర క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ శివనాగప్రసాద్, ఎంఈఓ ఓంకార్‌యాదవ్, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడ్, సర్పంచు నాగేశ్వరమ్మ, సింగిల్ విండో చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పురుషుల విభాగంలో విజేత గుట్టపాడు

నియోజకవర్గస్థాయి కబడ్డీ పోటీలలో పురుషుల విభాగంలో గుట్టపాడు జట్టు విజేతగా నిలిచినట్లు ఫిజికల్ డైరెక్టర్ హరిప్రసాద్ తెలిపారు. మొత్తం 6 జట్లు పోటీలో పాల్గొనగా తుది పోరులో పాణ్యం -4 సచివాలయం జట్టుపై, గుట్టపాడు జట్టు ఆధిక్యతను సాధించి మొదటి బహుమతి రూ.35వేలు, రెండో బహుమతి పాణ్యం జట్టు రూ.15వేలు, మూడో బహుమతి కల్లూరు మండలం, మార్కాపురం జట్టుకు రూ.5 వేలు అందజేసినట్లు తెలిపారు.





విజేతగా నిలిచిన బిలకలగూడూరు కబడ్డీ టీం, రన్నర్‌గా నిలిచిన సల్కాపురం జట్టును అభినందిస్తున్న ఎంపీడీఓ

మహిళల విభాగంలో ..

ఆడుదాం..ఆంధ్ర క్రీడా పోటీలలో మహిళల విభాగంలో భాగంగా గడివేముల మండలం, బిలకలగూడూరు సచివాలయ జట్టు ప్రథమ విజేతగా నిలువగా రూ.35 వేలు, ద్వితీయ స్థానంలో గెలిచిన కల్లూరు మండలం, సల్కాపురం సచివాలయం జట్టుకు రూ.15వేలు, మూడో స్థానంలో గెలిచిన కల్లూరు మండలం, వీకర్‌సెక్షన్ కాలనీకి చెందిన జట్టుకు రూ.5వేల చొప్పున బహుమతులు ప్రాధానం చేయనున్నట్లు వెల్లడించారు.

కబడ్డీలో సత్తాచాటిన బిలకలగూడూరు

గడివేముల: ఆడుదాం ఆంధ్ర క్రీడా నియోజకవర్గ స్థాయి క్రీడల్లో బిలకలగూడూరు మహిళల కబడ్డీ జట్టు సత్తాచాటింది. నియోజకవర్గ స్థాయి పోటీల్లో ఆరు జట్లను ఓడించి మొదటిస్థానంలో నిలిచినట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప తెలిపారు. దీంతో జట్టు జిల్లా స్థాయిలో ఆడేందుకు అర్హతసాధించినట్లు చెప్పారు. ప్రతిభ కనబరిచిన కబడ్డీ టీం సభ్యులను పలువురు అభినందించారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

కల్లూరు: క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని ఎంపీడీఓ రమణమూర్తి అన్నారు. మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో సల్కాపురం గ్రామ సచివాలయానికి చెందిన కబడ్డీ (బాలికల జట్టు) ప్రతిభ చూపి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యింది. నియోజకవర్గ స్థాయిలో రన్నర్‌గా నిలిచింది. కబడ్డీ జట్టును ఎంపీడీఓ రమణమూర్తి తన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సల్కాపురం సర్పంచ్ మద్దిలేటి, పెద్దటేకూరు ఎంపీటీసీ మునిస్వామి, పంచాయతీ కార్యదర్శులు ఉమాదేవి, శ్రీనివాసులు, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల్లోని నైపుణ్యాల గుర్తింపునకు ఆటల పోటీలు



ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి

కోడుమూరు రూరల్ : గ్రామీణ క్రీడాకారుల్లోని నైపుణ్యాలను వెలికితీసేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలను నిర్వహిస్తోందని కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం కోడుమూరులోని బాలుర హైస్కూల్లో ఏర్పాటు చేసిన ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలను సింగిల్ విండో అధ్యక్షుడు క్రిష్టారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించింది లేదన్నారు. క్రీడాకారులంతా నియోజకవర్గ స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చడంతో పాటు, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ రాణించి మంచి పేరు ప్రఖ్యాత్యులు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయన్న, కోడుమూరు, గూడూరు ఎంపీడీఓలు చంద్రశేఖర్, రాముడు, సి.బెళగల్ ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, పీఈటీలు సురేంద్రనాయుడు, శ్రేయశ్రీ, వెంకటరాముడు, భాస్కర్, శ్రీనివాసులు, గణపతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, నాయకులు ప్రసాద్, గ్రామ సచివాలయ సిబ్బంది, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించవచ్చు

కల్లూరు: బాలికలు నూన్యతా భావాని వదిలితే అన్ని రంగాల్లో రాణించవచ్చని సమగ్ర శిక్ష ఏపీసీ సీహెచ్ విజయ జ్యోతి కుమారి అన్నారు. బుధవారం జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా లక్ష్మీపురంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో జీసీడీఓ సునీతతో కలసి ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల స్టోర్ రూమ్‌లో ఉన్న వస్తువులను పరిశీలించి,అరటి పండు, గుడ్లును తూకం వేసి బరువు చూశారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డిస్తున్నారా అని తెలుసుకుని, విద్యార్థులతో కలసి మధ్యాహ్నం భోజనం చేశారు. ఏపీసీ మాట్లాడుతూ బాలికలు చదులతో పాటు మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులు వంద శాతం ఉతీర్ణత సాధించేల ఉపాధ్యాయులు బోధన చేయాలన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబర్చిన పాఠశాలకు చెందిన విద్యార్థిని సాయిప్రియను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి పాల్గొన్నారు.



విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న సమగ్ర శిక్ష ఏపీసీ విజయ జ్యోతి కుమారి

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి

- గ్రీన్‌కో, అదానీ కంపెనీలకు కలెక్టర్ డాక్టర్ జి.సృజన సూచన

కర్నూలు(సెంట్రల్): సామాజిక బాధ్యతగా సోలార్ పార్కు ఏరియాలోని గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులకు నిధులను కేటాయించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన గ్రీన్‌కో, అదానీ కంపెనీలకు సూచించారు. వార్షిక టర్నోవర్‌లో రెండు శాతం నిధులను సమకూర్చాలన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మెగా సోలార్ పార్కు లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ కమిటీ 14వ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2016 నుంచి సోలార్ విద్యుత్ సంస్థ చేపట్టిన పలు అభివృద్ధి పనులపై విపులంగా కలెక్టర్ సృజన, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పీఆర్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన రూ.27 కోట్ల పనులకు సంబంధించిన యూసీ (యూటిలైజేషన్ సర్టిఫికెట్) సమర్పించాలన్నారు. నిర్మాణంలో రూ.5 కోట్ల పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రూరల్ వాటర్ స్కీంకు సంబంధించిన పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈడబ్ల్యూఐడీసీ విభాగానికి చెందిన పది పనులను రూ.45.5 లక్షలతో పూర్తి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీపీఓ హిమ ప్రభాకర రాజు, పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం, ఈఈ మద్దన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కల్లూరులో మాక్ పోలింగ్

కల్లూరు: మండలంలోని కల్లూరు, నాయకల్లు, కొల్లంపల్లితండా పోలింగ్ కేంద్రాలను పాణ్యం ఎన్నికల అధికారి, జేసీ నారపురెడ్డి మౌర్య బుధవారం పరిశీలించారు. కల్లూరు అర్బన్ పరిధి పోలింగ్ కేంద్రంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటు వేసిన గుర్తుపై కాకుండా వేరే ఇతర గుర్తులకు ఓటు బదిలీ అవుతుందన్న అపోహలను తొలగించడానికి మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ పోలింగ్‌లో డమ్మీ గుర్తులను ఉపయోగించారు. కొల్లంపల్లితండాలో 350 ఓటర్లు ఉండగా అక్కడ నూతనంగా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి, నాయకల్లు గ్రామంలో ప్రస్తుతం ఉన్న పోలింగ్ కేంద్రాన్ని ఎంపీపీ పాఠశాలలోకి మార్చడానికి ఎన్నికల కమిషనర్ ఉన్నతాధికారులకు నివేదికను పంపారు. కార్యక్రమంలో పాణ్యం ఎన్నికల అధికారి, జేసీ నారపురెడ్డి మౌర్య వెంట తహశీల్దార్ రమేష్ బాబు ఉన్నారు.



మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న పాణ్యం ఎన్నికల అధికారి, జేసీ నారపురెడ్డి మౌర్య

కలెక్టర్, ఎస్పీని కలిసిన కుడా చైర్మన్

కర్నూలు సిటీ: జిల్లా కలెక్టర్ డా.జి సృజన, ఎస్పీ కృష్ణకాంత్‌ను బుధవారం కుడా చైర్మెన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త డా.ఆదిమూలపు సతీష్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనులు, పెండింగ్ పనుల గురించి కలెక్టర్‌కు వివరించారు. రాబోయే ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం

కర్నూలు సిటీ: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని జిల్లా ప్రజా రవాణా అధికారి టి.వెంకటరామం అన్నారు. ఏపీఎస్ఆర్టీసీ జోనల్ కార్యాలయంలో బుధవారం డ్రైవర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆయన పాల్గొని డ్రైవర్ల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ డిపోల మేనేజర్లు, జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

బి.క్యాంప్ క్వార్టర్స్‌లో అగ్నిప్రమాదం

కర్నూలు : నగర శివారులోని బి.క్యాంప్ క్వార్టర్స్‌లో పంచాయతీరాజ్ శాఖ జూనియర్ అసిస్టెంట్ వీరేష్ నివాసముంటాడు. బుధవారం ఆయన విధులకు వెళ్లిన తర్వాత ఇంట్లో విద్యుదాఘాతం ఏర్పడి మంటలు వ్యాపించాయి. బీరువాతో పాటు ఫ్రిడ్జ్ వస్తువులు, ఇతర సామగ్రి మంటల్లో కాలిపోయాయి. కుటుంబ సభ్యులు అప్రమత్తమై ఇంట్లో నుంచి పరిగెత్తుకుంటూ బయటకు వచ్చి తర్వాత నీళ్ల చల్లినప్పటికీ అప్పటికే వస్తువులన్నీ కాలిపోయాయి. దాదాపు రూ.2 లక్షల దాకా నష్టం వాటిల్లి ఉంటుందని అంచనా.

ప్రారంభోత్సవానికి సిద్ధం

కల్లూరు: మండల పరిధిలోని బస్తిపాడు జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించిన ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. రూ. 45లక్షలతో 40వేల లీటర్ల ట్యాంక్‌తో పాటు 200 ఇళ్లకు కుళాయి కనెక్షన్ ఇచ్చారు. గురువారం పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ట్యాంకును ప్రారంభిస్తారని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనాథ్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి బుధవారం తెలిపారు. అలాగే బస్తిపాడు గ్రామంలో రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, చిన్నటేకూరులో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించనున్నారు.



ప్రారంభోత్సవానికి సిద్ధమైన ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్

పెండింగ్ పనులు పూర్తి చేయండి

- సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- త్వరలో ఇళ్ల పట్టాల పంపిణీకి చర్యలు తీసుకోండి
- పిన్నాపురం రైతులకు త్వరలో పరిహారం

పాణ్యం: ఆయా శాఖల్లో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ఉసేన్‌బీ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే హాజరైయ్యారు. ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల కోడ్ వస్తే ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోతాయని, అధికారులు బదిలీలు కూడా ఉంటాయన్నారు. వచ్చేఅధికారికి సమస్యలను పరిష్కరించేందుకు సమయం పడుతుందన్నారు. కావున అధికారులు యా శాఖల్లో ఉన్న పెండింగ్ పనులపై దృష్టి సారించి ఈనెల 30 నాటికి పూర్తి చేయాలన్నారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా 90 రోజుల్లో అర్హులకు అందించే ఇంటి పట్టాల జాబితాను తయారు చేయాలన్నారు.

రైతులకు పరిహారం..

పిన్నాపురం రైతులకు గ్రీన్‌కో సంస్థ రూ.19కోట్లు డిపాజిట్ చేసినందున కలెక్టర్ ద్వారా వారికి చెక్కుల పంపిణీ చేసేందుకు ప్రణాళికలు ఇవ్వాలని తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్‌ను కోరారు. మండలంలో జొన్న పంటను రైతుల సమక్షంలో, స్వగ్రామంలోనే కొనుగోలు చేసేలా చూడాలన్నారు. రైతులకు దిగుబడులను పట్టణాలకు తీసుకురావాలని సూచించడం సరికాదన్నారు.



రజక సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

రజక కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ

మండల కేంద్రమైన పాణ్యంలోని శ్రీ కృష్ణ కల్యాణ మండపం వెనుక భాగంలో పాణ్యం రజక సంఘం భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కాటసాని భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అంతేకాక ఆయా వర్గాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా ప్రణాళికలు రూపొందించారని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు సద్దల సరళమ్మ, మాజీ జెడ్పీటీసీ సభ్యులు సద్దల సూర్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, తహసీల్దార్ శ్రీనివాసులుగౌడ్, ఎంపీడీఓ దస్తగిరి, బద్రినాథ్‌రావు, కో–ఆప్షన్ సభ్యులు జాకీర్ ఉసేన్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న ఎంఈఓ కోటయ్య

పాణ్యం: స్థానిక భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసినట్లు ఎఈంఓ కోటయ్య తెలిపారు. ట్యాబ్‌ల పని తీరుపై వారికి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శన్యాస్, అరుణకుమారి, కృష్ణప్రియ, శివసాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేసిన దృశ్యం

సి.బెళగల్: విద్యార్థులు ప్రభుత్వ సహకారంతో అందుతున్న ట్యాబ్‌లను ఉపయోగించుకుని సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సంగాల గ్రామ సర్పంచ్ హనుమంతు అన్నారు. బుధవారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు హెచ్‌ఎం సునీల్‌రాజు ట్యాబ్‌ల పంపిణీ చేపట్టారు. కార్యక్రమానికి హాజరైన సర్పంచ్ ప్రభుత్వం విద్యార్థులకు సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలను, పాఠశాలల అభివృద్ధి చేపట్టిన పనులను వివరించారు. అనంతరం పాఠశాలకు చెందిన 42 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు తిమ్మారెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

నెరవేరుతున్న కల

- నెరవాడ హైవే నుంచి పుట్టాలమ్మ వరకు బీటీరోడ్డు
- రూ.2.70కోట్లతో నిర్మాణం
- భూమిపూజ చేసిన ఎమ్మెల్యే కాటసాని

పాణ్యం : మండల పరిధిలోని నెరవాడ గ్రామ ప్రజల ఏళ్ల నాటి కల సకారమవుతోంది. నెరవాడ మెట్ట నుంచి గ్రామం మీదుగా పుట్టాలమ్మ గుడి వద్దకు ఉన్న ప్రధాన రోడ్డు పూర్తిగా దె దెబ్బతిని ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడేవారు. బుధవారం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి నూతన రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నెరవాడ ప్రజల రెండు ప్రధాన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపామన్నారు. రైల్వే డబుల్‌లేన్‌లో భాగంగా బ్రిడ్జి కింద నీటి ప్రవాహం లేకుండా అండర్ డ్రైనేజీ నిర్మించాలని రైల్వే డీఆర్ఎం మనీష్ అగర్వాల్, జీఎం అరుణ్‌కుమార్ జైన్‌తో కలిసి వివరించినట్లు తెలిపారు. ఈ మేరకు నెరవాడ రైల్వే బ్రిడ్జి కింద అండర్ డ్రైనేజీ నిర్మాణం పనులకు రైల్వే శాఖ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నారు.

3.5 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం

హైవే నుంచి పుట్టాలమ్మ వరకు దాదాపుగా 3కిలోమీటర్ల మేర రోడ్డు దెబ్బతినడం వలన ప్రజలు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్న విషయం స్థానిక నాయకులు తన దృష్టికి తెచ్చారని ఎమ్మెల్యే చెప్పారు. దీంతో రోడ్డుకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయించి నిధులు విడుదల చేయించినట్లు తెలిపారు. పీఐయూ నిధులు రూ. 2.70కోట్లుతో 3.5 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు వేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ లింగాల శారదమ్మ, వైస్ ఎంపీపీ పార్వతమ్మ, రాంభూపాల్‌రెడ్డి, శివారెడ్డి, ప్రతాప్ రెడ్డి, పీఆర్ ఏఈ మహబూబ్‌బాషా, మహనందిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతిరాంలో వర్క్‌షాప్

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల వర్క్ షాప్ ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ సీఎస్ఐ విభాగానికి చెందిన విద్యార్థులకు డార్క్ ప్యాట్రన్ అనే అంశంపై అవగాహన కల్పించామన్నారు.హైదరాబాద్‌కు చెందిన బ్రెయినో విజన్ సొల్యూషన్‌కు చెందిన పవన్‌కుమార్ ఆన్‌లైన్ మోసాలు, వాటిని నివారించేందుకు సాఫ్ట్‌వేర్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

దుకాణాల్లో చోరీ

పాణ్యం: మండల కేంద్రంతో పాటు నెరవాడ మెట్ట వద్ద ఉన్న పలు దుకాణాల్లో దొంగలు హల్‌చల్ సృష్టించారు. బుధవారం తెల్లవారుజామున పాణ్యం బస్టాండ్‌లోని దుకాణాల్లో సిగరేట్ ప్యాక్‌లు, నగదును ఎత్తుకెళ్లారు. బైక్‌పై వచ్చిన దొంగలు నెరవాడ మెట్ట వద్ద ఓ దుకాణం వద్ద తాళాలు పగులగొడుతుండగా గమనించిన స్థానికులు కేకలు వేయడంతో సిగరేట్ ప్యాకెట్లు, బైక్‌ను వదిలి పారిపోయారు. ఉదయం విషయం తెలుసుకున్న పోలీసులు దుకాణాల వద్దకు చేరుకొని విచారణ చేపట్టారు.

శరీన్‌నగర్ హైస్కూల్ హెచ్‌ఎం మృతి

కల్లూరు: కల్లూరు అర్బన్ శరీన్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.హేమలత (50) అనారోగ్యంతో మృతి చెందారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న ఆమె బుధవారం మృతి చెందినట్లు మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఎంఈఓ, ఉపాధ్యాయులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



హేమలత (ఫైల్)